సాక్షి
జనగామ

బుధవారం | 5 | జూలై | 2023



కమీషన్ లైసెన్సుల లొల్లి
వరంగల్ ఏనుమాముల మార్కెట్‌లో అడ్తి లైసెన్సుల జారీలో మార్కెట్ కమిటీ, చాంబర్ల మధ్య అంతర్గత పోరు సాగుతోంది.
- 8లో



సాయుధ పోరాటం హైజాక్
తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటాన్ని పాలకవర్గాలు హైజాక్ చేస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు.
- 10లో

గరిష్టం/కనిష్టం
$30^0/24^0$
వాతావరణం
జిల్లాలో ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలు చోట్ల ఉరుములతో కూడిన వర్షం పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

ఐలమ్మ స్మారక పార్కు నిర్మాణానికి స్థల పరిశీలన



పాలకుర్తి: సాయుధ పోరాట యోధురాలు చిట్యాల ఐలమ్మ స్మారక పార్కు, హరితహోటల్ నిర్మాణ స్థలాలను కలెక్టర్ శివలింగయ్య మంగళవారం పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ లక్ష్మీనారాయణపురం గ్రామం శివారులో చిట్యాల ఐలమ్మ స్మారక భవనం, ఎల్లారాయని తొర్రూరు గ్రామంలో హరితహోటల్ నిర్మించనున్నట్లు ఆయన తెలిపారు. అలాగే హరితహారం కార్యక్రమంలో నాటిన మొక్కలను సంరక్షించాలని ఆయన కోరారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్, డీఆర్‌డీఓ రాంరెడ్డి, ప్రాజెక్టు అధికారి గోపాల్‌రావు, ఏడీ సర్వేయర్ ల్యాండ్ కొండల్ రెడ్డి, టూరిజం డీఈ ఆంజనేయులు, ఆర్కిటెక్ దివాకర్, తహసీల్దార్ పాల్‌సింగ్, ఎంపీడీఓ అశోక్ కుమార్ పాల్గొన్నారు.

అభ్యంతరాల స్వీకరణ

జనగామ రూరల్: జిల్లా విద్యాశాఖ సమగ్ర శిక్ష విభాగంలో కాంట్రాక్ట్ పద్ధతిలో ఎంఐఎస్ కోఆర్డినేటర్, సిస్టమ్ అనాలసిస్, డాటా ఎంట్రీ ఆపరేటర్, రీసోర్స్ పర్సన్ పోస్టులకు ఈ నెల 3న సర్టిఫికెట్ల పరిశీలన జరిగిందని, అభ్యర్థుల ప్రొవిజినల్ జాబితాను డీఈఓ కార్యాలయంలో నేడు (బుధవారం) ప్రదర్శించనున్నట్లు డీఈఓ రాము మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికపై ఎలాంటి అభ్యంతరాలు ఉన్న ఈ నెల 6లోగా విద్యాశాఖ కార్యాలయంలో రాతపూర్వకంగా తెలపవచ్చాన్నారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి

జనగామ రూరల్: ఈనెల 7వ తేదీన వరుణ్ మోటర్ ప్రైవేట్ కంపెనీ హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించే జాబ్‌మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఉపాధి అధికారి ఉమారాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిట్టర్, డీజిల్ మోకానిక్‌లో ఉద్యోగాలు ఉన్నాయని, అర్హులైన వారు తమ ధ్రువీకరణ ప్రతాలతో జిల్లా కలెక్టరేట్‌లోని సెకండ్ ఫ్లోర్ రూం నంబర్ ఎస్ 29కు రావాలన్నారు. మరిన్ని వివరాలకు 79954330401 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

నూతన ఆవిష్కరణకు దరఖాస్తుల ఆహ్వానం



జనగామ రూరల్: ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమంలో గ్రామస్థాయిలో నూతన ఆవిష్కరణలను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ అన్నారు. మంగళవారం అదనపు కలెక్టర్ చాంబర్‌లో జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలు, విద్యార్థులు, యువత, ప్రతిఒక్కరూ తమ నైపుణ్యాలను వెలికితీసేందుకు ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. ఇన్నోవేటర్‌లు తమ ఆవిష్కరణలు ఆగస్టు 5వ తేదీలోగా 91006785543 వాట్సాప్ నంబర్‌కు పంపాలన్నారు. పేరు, వయస్సు, ఫొటో, వృత్తి, గ్రామం, ఇన్నోవేషన్ గురించి 6 వ్యాక్యాలు, రెండు నిమిషాల నిడివి గల వీడియోను వాట్సాప్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఓ రంగాచారి, టూరిజం అధికారి గోపాల్‌రావు, డీఈఓ కె రాము, డీపీఆర్‌ఓ రాజేంద్రప్రసాద్, సైన్స్ అధికారి గౌసియా బేగం తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష



జనగామ: పట్టణంలో జరుగుతున్న ఆరోగ్య కార్యక్రమాలపై స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం డీఎంహెచ్‌ఓ డాక్టర్ ప్రశాంత్ సమీక్ష నిర్వహించారు. ఆరోగ్య కార్యక్రమాలతో పాటు వైద్యసిబ్బంది పనితీరు, రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. గర్భిణులకు సమయానుకూలంగా పరీక్షలు చేసి సర్కారు దవాఖానాల్లో ప్రసవాలు జరిగేలా చూడాలన్నారు. ప్రస్తుతం వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ రవీందర్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీదేవి, వైద్యాధికారులు డాక్టర్ శ్రీ విద్య, డాక్టర్ శరత్, సామాజిక అధికారి రహమాన్ ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమేది?

- ఉత్సవాలకు నిధులు, వార్డుల అభివృద్ధిపై వివక్షత
- ఎజెండాలో సమగ్ర సమాచారం ఉండాలి
- టెండరు పూర్తయిన పనుల్లో ఆలస్యం ఎందుకు?
- పనుల ఆలస్యంపై పోడియం వద్ద సభ్యుల బైఠాయింపు
- వాడీవేడిగా కౌన్సిల్ సమావేశం



నిధుల ఖర్చుపై మండిపడుతున్న బీజేపీ కౌన్సిలర్ హరిశ్చంద్రగుప్త

జనగామ: పట్టణంలో వార్డుల అభివృద్ధిని పక్కన బెట్టి.. ఉత్సవాల పేరిట మున్సిపల్ నిధులను అడ్డగోలుగా ఖర్చు చేస్తున్నారని, ప్రజా సమస్యల పరిష్కారంలో విఫలమయ్యారని పలువురు కౌన్సిలర్లు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. టెండర్లు పూర్తి చేసుకున్న పనులు సైతం పూర్తి చేయించడంలో అధికారులు విఫలమయ్యారని నిరసిస్తూ కౌన్సిలర్లు పోడియం ఎదుట బైఠాయించారు. మంగళవారం మున్సిపల్ చైర్‌పర్సన్ పోకల జమునలింగయ్య అధ్యక్షతన జరిగిన కౌన్సిల్ సమావేశం వాడివేడిగా జరిగింది. పనుల ఆలస్యంపై అధికార, ప్రతిపక్ష సభ్యులు సైతం ఆగ్రహం వ్యక్తం చేయడం గమనార్హం. కాగా 20 ఎజెండా అంశాలకు కౌన్సిల్ ఆమోదం లభించిందని కమిషనర్ రజిత తెలిపారు. బీజేపీ కౌన్సిలర్ మహంకాళి హరిశ్చంద్ర గుప్త మాట్లాడుతూ దశాబ్ది ఉత్సవాల పేరుతో ఇప్పటి మున్సిపల్ నిధుల నుంచి రూ.10 లక్షలు ఖర్చు చేసి, సరిపోవడం లేదని మరో రూ.1.50లక్షలకు అదనంగా ఎజెండా అంశం తీసుకురావడం సిగ్గుచేటన్నారు. ప్రజల నుంచి వసూలు చేస్తున్న పన్నులను పట్టణ అభివృద్ధికి వినియోగించకుండా ఇలా వృధా చేయడం ఏంటని ప్రశ్నించారు. ఎజెండా అంశాల్లో పూర్తి సమాచారం చేర్చాలన్నారు. కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ గంగరబోయిన మల్లేష్ మాట్లాడుతూ టీపీఓ సెక్షన్‌లో పనిచేసే భిక్షపతిని మార్చాలని గత కౌన్సిల్‌లో తీర్మానం చేసినా అక్కడే ఎలా పని చేస్తున్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్ సభ్యురాలు జక్కుల అనిత మాట్లాడుతూ గత సంవత్సర కాలంగా తన వార్డులో విద్యుత్ పోల్స్ వేయాలని విన్నవిస్తున్నా.. పట్టించుకోవడం లేదన్నారు. బీఆర్‌ఎస్ సభ్యురాలు బండ పద్మ మాట్లాడుతూ రాబోయే శ్రావణమాసం పర్వదినం పురస్కరించుకుని పెద్ద ఎత్తున బోనాల పండగ జరుగబోతుందని, ఆలయాలతో పాటు వార్డులో ప్రత్యేక అలంకరణ చేయాలని కోరారు. బీఏపీ కౌన్సిలర్ బొట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీలకు నిధులు మంజూరు చేస్తూ, జనగామకు ఎందుకు ఇవ్వడం లేదన్నారు. బీఆర్‌ఎస్ సభ్యురాలు పగిడిపాటి సుధ సుగుణాకర్ రాజు మాట్లాడుతూ వార్డులో అభివృద్ధి పనులకు సంబంధించి వివక్షత ఎందుకన్నారు. బీఆర్‌ఎస్ కౌన్సిలర్ ఎండీ.సమ్మద్ మాట్లాడుతూ ప్లాంటేషన్, హరిత హారం పేరిట డబ్బులు ఖర్చు చేస్తున్నా, పర్యవేక్షణ కరువైందన్నారు. ఆయా వార్డుల్లో పనులకు టెండర్లు పూర్తయినా.. ఆలస్యంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ కౌన్సిలర్లు మహంకాళి హరిచంద్రగుప్త, బండ పద్మ, అనిత, చంద్రకళ, పేర్ని స్వరూప, పాక రమ, ఎండీ సమ్మద్, గుర్రం భూలక్ష్మి పోడియం వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ మేకల రాంప్రసాద్, డీఈ చంద్రమౌళి తదితరులు ఉన్నారు.



పోడియం ఎదుట సభ్యుల బైఠాయింపు

ఎజెండా అంశంలోని ముఖ్యమైనవి..

- జనగామ పట్టణానికి తాగునీరు అందిస్తున్న చీటకోడూరు డ్యాం ఫిల్టర్ బెడ్‌లో నీటిని శుద్ధి చేసేందుకు అవసరమైన క్లోరిన్ గ్యాస్, బ్లీచింగ్ పౌడర్, ఆలం, ఆక్టివేటెడ్ కార్బన్ ఆరు నెలల కోసం సరిపడు కెమికల్స్ కొనుగోలుకు సాధారణ పద్దు నుంచి రూ.21లక్షలకు కౌన్సిల్ ఆమోదం పొందారు.
- పట్టణంలోని పలు వార్డుల్లో కనీస మౌలిక వసతి సదుపాల కల్పన కోసం మున్సిపల్ సాధారణ పద్దు నుంచి రూ.1.53 కోట్ల అంచనాలతో డ్రెయినేజీలు, సీసీరోడ్డు, కల్వర్టు, కంపౌండ్ వాల్, మినీ వాటర్ ట్యాంకులు, కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం కౌన్సిల్ ఆమోదం పొందారు.
- స్వచ్ఛభారత్-స్వచ్ఛ తెలంగాణ కార్యక్రమంలో పరిశుభ్రత-పచ్చదనంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఆఫీసు కంపౌండ్ వాల్ పేయింటింగ్ కోసం 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.4 లక్షల ఖర్చు కోసం పరిపాలన అనుమతి పొందారు.
- ఇటీవల నిర్వహించిన దశాబ్ది ఉత్సవాల్లో ఫ్లెక్సీలు, తోరణాలు, పోస్టర్లు, మెమోంటోలు శాలువాలతో పాటు తదితర ఖర్చుల కోసం మరో రూ.1. 50 లక్షలకు రెండోసారి ఆమోదం తీసుకున్నారు.
- హరితహారంలో 2023-24 ఆర్థిక సంవత్సరానికిగాను నర్సరీ అభివృద్ధి, అవెన్యూ ప్లాంటేషన్, బహుళ వనరుల అవెన్యూ ప్లాంటేషన్లు, పీపీ వీలు, మొక్కలు నాటేందుకు క్రరలు, గుంతలు తవ్వించడం, డిగ్గింగ్ మిషన్ రిపేరుతో పాటు నూతన ట్రాక్టర్, ట్యాంకర్ కొనుగోలు కోసం గ్రీన్ ఫండ్ నుంచి రూ.22 లక్షల ఖర్చు కోసం ఎజెండా అంశంలో పొందుపరిచారు.
- నెహ్రూపార్కు జంక్షన్ అభివృద్ధికి 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.35 లక్షలకు కౌన్సిల్ ఆమోదం తీసుకున్నారు.
- పట్టణంలోని 4, 18, 2వ వార్డుల్లో గతంలో మెటల్ రోడ్డు నిర్మాణం కోసం కౌన్సిల్ అనుమతి పొందగా, దానిని సీసీ రోడ్డుగా మార్చేందుకు పట్టణ ప్రగతి నిధులు రూ.30 లక్షల బడ్జెట్ మంజూరు కోసం కౌన్సిల్ తీర్మానం పొందారు.
- జనగామ ఫ్లైఓవర్‌పై ఇటీవల కారు ఢీకొట్టిన ఘటనలో రేలింగ్ కూలిపోగా సాధరణ నిధుల నుంచి రూ.లక్షతో మరమ్మతు చేపట్టారు.

అర్హులందరికీ రుణాలు

- 2023-24 వార్షిక రుణ ప్రణాళిక రూ.3102.75 కోట్లు
- గడిచిన ఏడాదిలో 98 శాతం లక్ష్యం పూర్తి
- బ్యాంకర్ల సమావేశంలో కలెక్టర్ శివలింగయ్య



మాట్లాడుతున్న కలెక్టర్ శివలింగయ్య

జనగామ: ప్రభుత్వం ఆశించిన మేర జిల్లాలో అర్హులైన ప్రతిఒక్కరికీ రుణాలు అందించాలని కలెక్టర్ సీహెచ్ శివలింగయ్య అన్నారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశం హాల్‌లో జరిగిన జిల్లా స్థాయి బ్యాంకర్ల సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలోని అర్హులందరికీ పంట, సూక్ష్మ, గృహ, విద్య, వ్యవసాయ సంబంధిత రుణాల మంజూరులో బ్యాంకర్లు ప్రభుత్వం సంకల్పం నెరవేరేలా చూడాలన్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో 98 శాతం లక్ష్యాన్ని సాధించామన్నారు. ప్రస్తుత 2023 -2024 వార్షిక రుణ ప్రణాళిక రుణ షెడ్యూల్ కర పత్రం ఆవిష్కరించారు. ఈ ఏడాది వార్షిక రుణ ప్రణాళిక లక్ష్యం రూ.3102.75 కోట్లు టార్గెట్ పెట్టుకోగా, ఇందులో పంట రుణాల కోసం రూ.1592.57 కోట్లు, టర్మ్ రుణాలు రూ.531.72 కోట్లు, వ్యవసాయ రంగంలో కనీస మౌలిక సదుపాయాల కోసం రూ.116.32కోట్లు, వ్యవసాయ అనుబంధ రంగాల కోసం రూ.410.71 కోట్లు, ఎంఎస్ఎం కింద రూ.297.09కోట్లు, ఇతర ప్రాధాన్యత రంగాల్లో రుణాల కోసం రూ.94.49కోట్లు, నాన్ ప్రియార్టీ సెక్టార్స్ కోసం రూ.59.85 కోట్లను కేటాయించినట్లు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఆర్బీఐ ఏజీఎం తేజ్ దీప్ బెహరా, నాబార్డ్ ఏజీఎం చంద్రశేఖర్, డిస్ట్రిక్ట్ లీడ్ బ్యాంక్ మేనేజర్ ఎం. శ్రీధర్, డీఆర్డీ రాంరెడ్డి, డీఏఓ వినోద్ కుమార్, సంబంధిత శాఖల అధికారులు, బ్యాంకు కంట్రోలర్స్ పాల్గొన్నారు.

ఈవీఎం మిషన్ల పరిశీలన

జనగామ రూరల్: కలెక్టర్ కార్యాలయంలోని ప్రాంగణంలోని ఈవీఎం గోదాంను ప్రక్రియను మంగళవారం కలెక్టర్ సీహెచ్ శివలింగయ్య, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ పరిశీలించారు. ఎలాంటి సమస్యలు లేకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేపట్టాలన్నారు.

మన ఊరు-మనబడి పనులపై టెలీకాన్ఫరెన్స్

మన ఊరు-మనబడి పనులు త్వరగా పూర్తి చేయాలని టెలీకాన్ఫరెన్స్‌లో పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి వాకాటి కరుణ అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లతో టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. పనుల పురోగతిపై చర్చించారు. అనంతరం కలెక్టర్ శివలింగయ్య మాట్లాడుతూ జిల్లాలో 176 పాఠశాలలు మన ఊరు మనబడి కింద ఎంపిక కాగా అన్ని పాఠశాలల్లో పనులు ప్రారంభించామన్నారు. ఇప్పటికే 30 పాఠశాలలు ప్రారంభోత్సవాలు జరిగాయని 13 పాఠశాలలు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. మిగతావి కూడా త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో డీఈఓ కె రాము, ఏఓ మన్సూరీ, అధికారులు పాల్గొన్నారు.

అట్టడుగు వర్గాల అభ్యున్నతే లక్ష్యం

కొడకండ్ల: సమాజంలోని అట్టడుగు వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా ప్రధాని మోదీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం పరిపాలన సాగిస్తుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పెదగాని సోమయ్య అన్నారు. మంగళవారం మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఉపేందర్ అధ్యక్షతన జరిగిన వరంగల్ బహిరంగ సభ సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రైతులకు రూ.24 వేల వ్యవసాయ సబ్సిడీతో పాటు పీఎం కిసాన్ యోజన కింద 12 కోట్ల మంది రైతులకు సంవత్సరానికి రూ.6 వేలు అందిస్తూ రైతు పక్షపాతిగా కేంద్ర ప్రభుత్వం నిలుస్తుందన్నారు. ఈ నెల 8న వరంగల్‌లో రైల్వే కోచ్ వ్యాగన్‌ను మోదీ ప్రారంభించడంతో పాటు బహిరంగ సభలో పాల్గొననున్నందున బీజేపీ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలన్నారు. అనంతరం సోమయ్యను బీజేపీ నాయకులు సన్మానించారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు లేగ రామ్మోహన్‌రెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ శ్రీమాన్, మోడపల్లి సోమన్న, రాయుడు, హరిబాబు, పనస రాములు, సాయి, అంజనేయులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న నాయకులు

ఊరూరా ఎర్రబెల్లి జన్మదిన వేడుకల జోరు

దేవరుప్పుల: పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు జన్మదినం పురస్కరించుకొని బీఆర్‌ఎస్ నాయకులు, మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఊరూరా వేడుకలు నిర్వహించారు. మంగళవారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తీగల దయాకర్ అధ్యక్షతన యువ నాయకుడు బబ్బూరి శ్రీకాంత్‌గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 67 కిలోల కేక్‌ను మంత్రి సతీమణి, ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్టు చైర్‌పర్సన్ ఉషాదయాకర్‌రావు కట్ చేశారు. అనంతరం బీఆర్‌ఎస్ మండల పార్టీ ఆధ్వర్యంలో దేవరుప్పుల చౌరస్తాలో అన్నదానం, సీతారాంపురం అనాథ శరణాలయంలో వృద్ధులకు దుప్పట్లు, రూ.10 వేల వంట సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా ఉషా మాట్లాడుతూ ప్రజాధరణ పొందిన దయన్న సేవలకు ఊరూరా వేడుకలు అద్దం పడుతున్నాయన్నారు. సింగరాజుపల్లి, దేవరుప్పుల తదితర గ్రామాల్లో మహిళల కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాల వద్ద మంత్రి దయాకర్‌రావు జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో బీఆర్‌ఎస్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తీగల దయాకర్, చింత రవి, ఎంపీపీ బస్వ సావిత్రి మల్లేషమ్, పల్ల సుందర్‌రామిరెడ్డి, రైతుబంధు మండల కోఆర్డినేటర్ నర్సింహ్మారెడ్డి, సర్పంచ్‌లు రమాదేవి, రమేష్, మల్లేష్, వైస్‌ఎంపీపీ విజయ్, ఎంపీటీసీ రేణుక, ఐకేపీ ఏపీఓ వెంకట్‌రెడ్డి, చందన సమాఖ్య అధ్యక్ష, కార్యదర్శులు ఉమ, సంధ్య, సీసీలు ఉమ, వసంత, వీఓఎలు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.



ఎర్రబెల్లి ఉషాకు కేక్ తినిపిస్తున్న నాయకులు

పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక

- ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్: బీసీ కులవృత్తులు, చేతి వృత్తుల వారికి ప్రభుత్వం ఆర్థిక సాయంగా అందించే రూ.1 లక్ష రుణాలకు లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేస్తారని ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. బీసీ కుల, చేతివృత్తుల వారికి రాష్ట్ర ప్రభుత్వం అందించే రూ. 1లక్ష సబ్సిడీ రుణాలపై నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన ఎంపీడీఓలతో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీసీల్లో అల్ప సంఖ్యాక కులాలకు చెందిన వారు, చేతి, కుల వృత్తులు చేసుకునే రజక, నాయీబ్రాహ్మణ, కమ్మరి, కుమ్మరి, వడ్డెర, మేధర, మేర, ఉప్పర, సవర, ఆరెకటిక, గంగిరెద్దులు, బాల సంతాలు తదితరులకు రూ.1 లక్ష ఆర్థిక సాయంగా రుణాలు అందించేందుకు సీఎం కేసీఆర్ నిర్ణయించారన్నారు. అర్హులైన వారందరికీ ప్రభుత్వ నిబంధనలకు లోబడి రూ.లక్ష సబ్సిడీ రుణం అందిస్తారన్నారు. ఎలాంటి అవకతవకలకు తావులేకుండా లబ్ధిదారుల ఎంపికను పారదర్శకంగా చేపట్టాలని ఆయన అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓలు శ్రీధర్‌స్వామి, వేణుగోపాల్ రెడ్డి, మల్లిఖార్జున్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజయ్య

ముదిరాజ్ కులస్తులు రాజకీయంగా ఎదగాలి

- రిటైర్డ్ సైనికుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మాచర్ల భిక్షపతి

రఘునాథపల్లి: ముదిరాజ్ కులస్తులు రాజకీయంగా, ఆర్థికంగా ఎదగాలని రిటైర్డ్ సైనికుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మాచర్ల భిక్షపతి పిలుపు నిచ్చారు. మంగళవారం మండలంలోని మండల గూడెంలో రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన డాక్టర్ భిక్షపతిని గ్రామ ముదిరాజ్ సంఘం, మత్స్య కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అనంతరం సంఘం నేత ఉత్తెపు సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో డాక్టర్ భిక్షపతి మాట్లాడారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ ఉన్నతులుగా ఎదిగి ముదిరాజ్‌ల జాతి గౌరవాన్ని పెంచాలన్నారు. ముదిరాజ్ కులస్తులందరూ ఐక్యమత్యంగా ముందుకు సాగాలని ఆయన పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో సర్పంచ్ ఉత్తెపు ఉమారాణి ముదిరాజ్ మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి కట్ల సదానందం, నాయకులు పిట్టల సురేష్, పిట్టల సత్యం, నీల కృష్ణమూర్తి, డ్యాగల ఎల్లయ్య, పిట్టల భిక్షపతి, చింతకాయల శేఖర్, డేగల కుమార్, రజనీకాంత్, సాంబ, భిక్షపతి, డ్యాగల దెవేంద్ర, లలిత, మమత, ఎల్లబోయిన వెంకన్న, రమేష్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



డాక్టర్ భిక్షపతిని సత్కరిస్తున్న ముదిరాజ్ కులస్తులు

కిం కర్తవ్యం..!?

- బీజేపీ సంస్థాగత మార్పులతో ఉలికిపాటు
- ఉమ్మడి వరంగల్ సీట్ల కేటాయింపులో ఇక 'ఈటల'కీలకం
- కిషన్‌రెడ్డి వర్గీయుల్లో హర్షాతిరేకాలు
- 'బండి'ముద్ర చెరిపేసుకునేందుకు ప్రయత్నాలు
- అంతర్మథనంలో పలువురు ఆశావహ నాయకులు

సాక్షిప్రతినిధి, వరంగల్: భారతీయ జనతా పార్టీ సంస్థాగత మార్పులు ఆ పార్టీ రాజకీయాలను ఒక్కసారిగా వేడెక్కించాయి. రాష్ట్ర పార్టీలో మారిన పరిణామాలు ఉమ్మడి వరంగల్‌లో ఆ పార్టీనుంచి టికెట్ ఆశిస్తున్న వారిని ఉలికిపాటుకు గురిచేశాయి. నిన్నటిదాకా ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా పొరుగు జిల్లాకు చెందిన బండి సంజయ్‌కుమార్ వ్యవహరించగా... ఆయనతో ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు ఆశావహులు సత్సంబంధాలు కొనసాగించారు. ప్రజాసంగ్రామ యాత్ర సక్సెస్‌లో పాలు పంచుకున్నారు. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో టికెట్ ఖాయమనుకుంటుండగా బండి సంజయ్ మార్పు ఆశావహులను ఉలికిపాటుకు గురిచేసింది. ఈ అనూహ్య పరిణామాలను ఊహించని పలువురు 'బండి'ముద్రను చెరిపేసుకునే ప్రయత్నంలో పడగా.. కిషన్‌రెడ్డి వర్గీయుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

రాష్ట్ర కమిటీలో పలువురు సీనియర్లు.. మార్పులేని జిల్లా కమిటీలు...

బండి సంజయ్ రాష్ట్ర అధ్యక్షుడిగా 2020 మార్చిలో పదవీ బాధ్యతలు తీసుకున్న సమయంలో ఏర్పాటు చేసిన రాష్ట్ర కమిటీలో ఉమ్మడి వరంగల్‌కు చెందిన సీనియర్లు ఉన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా డాక్టర్ జి.విజయరామారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, అధికార ప్రతినిధిగా ఏనుగుల రాకేశ్‌రెడ్డిలకు అవకాశం దక్కింది. ప్రేమేందర్ రెడ్డి ప్రధాన కార్యదర్శిగా మూడోసారి నియమితులు కాగా, రాకేష్‌రెడ్డికి రెండోసారి చాన్స్ వచ్చింది. మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి ఎంపీగా పోటీ చేసి ఓడిపోయిన హుస్సేన్ నాయక్‌ను బీజేపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించారు. వీరు మూడేళ్ల పాటు ఈ పదవుల్లో కొనసాగనున్నారు. ఇదే సమయంలో హనుమకొండ జిల్లా అధ్యక్షురాలిగా రావు పద్మ, వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా సుమారు మూడేళ్లుగా మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్ ఉన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు యుగందీశ్వర్, ములుగుకు చింతలపూడి భాస్కర్‌రెడ్డిలు ఉండగా, జనగామ జిల్లా అధ్యక్షుడిగా ఆరుట్ల దశమంత రెడ్డి, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడిగా వి.రాంచందర్ రావులు వ్యవహరిస్తున్నారు. ఏడాదిగా కొత్త జిల్లా కమిటీలు వేస్తారని ప్రచారం జరిగినా... వారినే బండి సంజయ్ కొనసాగిస్తూ వచ్చారు. ప్రస్తుత సమయంలో రాష్ట్ర అధ్యక్షుడి మార్పు జరగ్గా.. జిల్లా రాష్ట్ర, జిల్లా కమిటీల్లోనూ మార్పులు ఉండవచ్చన్న చర్చ కూడా పార్టీలో సాగుతోంది.

టికెట్ల కేటాయింపులో ఇక ఈటలే కీలకం...

బీజేపీ రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్‌గా నియమితులైన హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ఇక ఉమ్మడి వరంగల్‌లో పార్టీ టికెట్ల కేటాయింపులో కీలకం కానున్నారు. ఈయన బీజేపీ రాష్ట్ర చేరికల కమిటీ చైర్మన్‌గా కూడా ఉన్నారు. ఇదే సమయంలో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సోదరుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు బీఆర్‌ఎస్‌నుంచి బీజేపీలో చేరారు. బీఆర్‌ఎస్ సీనియర్ కన్నెబోయిన రాజయ్య, మాజీ ఎమ్మెల్యే ఎం.భిక్షపతిలు కాషాయం కండువా కప్పుకున్నారు. మరికొందరు కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నేతలతో మంతనాలు జరిపిన ఆయన ఇప్పుడు ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్‌గా నియమితులయ్యారు. ఇంతకాలం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న బండి సంజయ్, ఈటల రాజేందర్‌ల మధ్య ఉన్న విభేధాల కారణంగా ఉమ్మడి వరంగల్‌లో రెండు గ్రూపులు పనిచేశాయి. రాష్ట్ర అధ్యక్షుడిగా బండి సంజయ్ 12 నియోజకవర్గాల నుంచి ఆశావహులుగా ఉన్న వారికి భరోసా ఇస్తూ వచ్చారు. ఇదే సమయంలో ఆ పార్టీ అధిష్టానం రాష్ట్ర అధ్యక్షుడి పదవినుంచి బండి సంజయ్‌ను తప్పించడంతో ఉమ్మడి వరంగల్ నుంచి టికెట్‌లు ఆశిస్తున్న పలువురిని ఆందోళనలో పడేసింది. దీంతో కొందరు 'బండి'ముద్రను తొలగించుకునే ప్రయత్నంలో పడ్డారు.

ఎక్కడినుంచి ఎవరు..

- వరంగల్ తూర్పు నియోజకవర్గంనుంచి ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, కుసుమ సతీష్, గంట రవికుమార్ తదితరులు ప్రయత్నం చేస్తుండగా, వరంగల్ పశ్చిమ నుంచి రావు పద్మ, ఏనుగుల రాకేష్‌రెడ్డి, మార్తినేని ధర్మారావులు ఉన్నారు.
- పరకాల నుంచి మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి, డాక్టర్ విజయచందర్ రెడ్డి, జి.ప్రేమేందర్‌రెడ్డిల పేర్లు వినిపిస్తుండగా, ఈటల రాజేందర్ సతీమణి ఈటల జమున పేరు కూడా ప్రచారంలో ఉంది.
- వర్ధన్నపేట నుంచి కొండేటి శ్రీధర్, మహబూబాబాద్ నుంచి జాటోత్ హుస్సేన్ నాయక్ పేర్లుండగా, నర్సంపేట నుంచి రేవూరి ప్రకాష్‌రెడ్డి, ఎడ్ల అశోక్‌రెడ్డిలు, జనగామ నుంచి దశమంత రెడ్డి, ముక్కెర తిరుపతి రెడ్డి, కేవీఎల్ఎన్ రెడ్డి తదితరుల పేర్లున్నాయి.
- భూపాలపల్లి కన్నం యుగందీశ్వర్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ ఎరుకల గణపతి, నిశిధర్ రెడ్డి, చదువు రాంచంద్రారెడ్డి, చాడ రఘునాథరెడ్డిలు, ములుగు నుంచి భూక్య రాజు నాయక్, అజ్మీర కృష్ణవేణి నాయక్ తదితరులున్నారు.
- పాలకుర్తి, డోర్నకల్, స్టేషన్‌ఘన్‌పూర్‌ల నుంచి కూడా పలువురు ఆశావహులు మారిన పరిణామాల నేపథ్యంలో టికెట్ల వేటలో కొత్తదారులు వెతకడంలో పడ్డారు.

ఐవీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నికకు కసరత్తు

జనగామ: జనగామ జిల్లాలోని అన్ని మండలాలతో పాటు పట్టణ ఐవీఎఫ్ నూతన కమిటీలకు కసరత్తు జరుగుతుందని సంఘ జిల్లా అధ్యక్షుడు బిజ్జాల నవీన్ గుప్తా మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న ప్రతిఒక్కరు సేవ చేసేందుకు ముందుకు రావాలన్నారు. ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ (ఐవీఎఫ్) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, పూర్వ తెలంగాణ పర్యాటక శాఖ అభివృద్ధి చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా నాయకత్వంలో జనగామ జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 9849495682 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం

- ఏబీవీపీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముట్టడి

జనగామ రూరల్: విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం ఆడుతుందని, వెంటనే విద్యారంగా సమస్యలు పరిష్కరించాలని ఉస్మానియా స్కాలర్ ప్రవీణ్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఏబీవీపీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌ను ముట్టడించారు. 1000 మంది విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించి అనంతరం ఏఓ మన్సూరీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌రెడ్డి మాట్లాడుతూ పాఠశాలల్లో అనేక సమస్యలు ఉన్నాయని డీఈఓ, ఎంఈఓ పోస్టులు భర్తీ చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఫీజు రీయింబర్‌మెంట్ బకాయిలు రూ. 5,300 కోట్లు విడుదల చేయకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ విభాగ్ కన్వీనర్ చింతకింది సంతోష్, జిల్లా కన్వీనర్ హృతిక్ సాయి, రమేష్, నరేష్, వంశీ, కార్తీక్, అరవింద్, గణేష్, నవీన్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు

క్లుప్తంగా

అమెరికాలో మంత్రి ఎర్రబెల్లికి ఘనస్వాగతం



దేవరుప్పుల: అమెరికా పర్యటనకు వెళ్లిన పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుకు వాషింగ్టన్ డీసీ ఎయిర్ పోర్ట్ వద్ద అభిమానులు, బీఆర్ఎస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం పుష్పగుచ్ఛాలు అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం భారీ కాన్వాయ్‌తో ఆయన ర్యాలీ నిర్వహించారు.

ఏసీబీకి చిక్కిన పంచాయతీ రాజ్ శాఖ ఏఈఈ లలిత



మహబూబాబాద్ రూరల్: ఓ కాంట్రాక్టర్ నుంచి రూ. 2 వేలు లంచం తీసుకుంటూ పంచాయితీరాజ్‌శాఖ ఏఈఈ అవినీతి నిరోధక శాఖ అధికారులకు పట్టుబడింది. ఈ ఘటన మంగళవారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో జరిగింది. ఏసీబీ డీఎస్పీ సుదర్శన్ కథన ప్రకారం జిల్లాలోని పెద్దవంగర మండలం కాన్వాయిగూడెం గ్రామంలో కాంట్రాక్టర్ కర్ర అశోక్‌రెడ్డి వైకుంఠధామం నిర్మాణ పనులు చేశారు. ఇందుకు 12.60 లక్షల బిల్లులు రావాల్సి ఉండగా అందులో కొంత మేరకు బిల్లుల చెల్లింపులు జరిగాయి. ఇంకా రూ. 3.51 లక్షలు రావాల్సి ఉంది. ఆ బిల్లులకు సంబంధించిన ఎంబీ రికార్డు విషయమై ఆయన జిల్లా కేంద్రంలోని పంచాయితీరాజ్‌శాఖ ఏఈఈ దొడ్డ లలితను సంప్రదించారు. రూ. 3.51 లక్షలు రావాల్సి ఉండగా ఏఈఈ లలిత తనకు రూ. 6 వేలు ఇవ్వాలని కాంట్రాక్టర్ అశోక్ రెడ్డిని అడిగింది. ఆయన రూ. 5 వేలు ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకుని జూన్ 3వ తేదీన రూ. 3 వేలు ఇచ్చి వెళ్లాడు. అదే సమయంలో అతడు ఏసీబీని ఆశ్రయించాడు. వారి సూచన మేరకు మిగతా రూ. 2 వేలు నగదును ఏఈఈ లలితకు ఇస్తుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. విచారణ అనంతరం ఆమెను చర్లపల్లి జైలుకు తరలించనున్నట్లు ఏసీబీ డీఎస్పీ తెలిపారు. ప్రభుత్వ అధికారులు లంచం డిమాండ్ చేస్తే ఏసీబీ టోల్ ఫ్రీ నంబర్ 1964కు సమాచారం ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈదాడుల్లో ఏసీబీ సీఐలు శ్యాం సుందర్, శ్రీను, రవి, సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యానికి రికార్డు ధర..



కేసముద్రం: కేసముద్రం వ్యవసాయ మార్కెట్లో మంగళవారం ధాన్యానికి రికార్డు స్థాయిలో రూ.3,329 ధర పలికింది. ధాన్యానికి మద్దతు ధర రూ.2,060 ఉండగా, మార్కెట్‌లో మద్దతుకు మించి ధర పలుకుతోంది. కాగా, మార్కెట్‌కు 2350 బస్తాల ధాన్యం అమ్మకానికి రాగా, క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.3329, కనిష్ట ధర రూ.1509 పలికినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు.

కమీషన్ లైసెన్సుల లొల్లి

రాష్ట్రంలోనే వరంగల్‌లో ఎక్కువ ఉన్నట్లు సమాచారం

- నిబంధనలకు విరుద్ధంగా జారీ
- డైరెక్టర్ హెచ్చరించినా దరఖాస్తుల స్వీకరణ
- మరికొన్ని జారీకి కమిటీ, అధికారుల కసరత్తు



వరంగల్ మార్కెట్ ప్రధాన కార్యాలయం

వరంగల్: వరంగల్ ఏనుమాముల మార్కెట్ మిర్చి కొనుగోళ్లలో రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో, పత్తి కొనుగోళ్లలో రెండో స్థానంలో ఉంది. ఈమార్కెట్‌కు రైతులు తీసుకొచ్చిన సరుకును అమ్మి కమీషన్ పొందేందుకు వ్యాపారులు ఎక్కువగా కమీషన్(అడ్తి) లైసెన్సులకు పోటీ పడుతున్నారు. ఈనేపథ్యంలో కమీషన్ లైసెన్సుల జారీ కోసం వరంగల్ మార్కెట్ కమిటీ, ఛాంబర్ల మధ్య అంతర్గత పోరు సాగుతోంది. కాగా.. కమీషన్ వ్యాపారుల వల్ల మార్కెట్‌కు ఎలాంటి ఆదాయం ఉండదు. రైతుల సరుకులను కమీషన్ వ్యాపారుల నుంచి ట్రేడర్ కొనుగోలు చేస్తే మాత్రం 1 శాతం మార్కెట్ ఫీజును మార్కెట్‌కు చెల్లించాలి. నిబంధనల ప్రకారం.. మార్కెట్‌కు వచ్చిన సరుకు అమ్మి ఇచ్చినందుకు రైతులకు వచ్చిన ఆదాయం నుంచి 2 శాతం కమీషన్ రూపేణ కమీషన్ వ్యాపారులు తీసుకోవాల్సి ఉంటుంది. కానీ.. రైతుల నుంచి 2 శాతం కాకుండా 4శాతం వరకు కమీషన్లు తీసుకుంటున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అందువల్లే కమీషన్ లైసెన్సులపై వ్యాపారులు మోజు పడుతున్నట్లు తెలుస్తోంది.

నిబంధనలేం చెబుతున్నాయంటే..

వ్యవసాయ మార్కెట్‌లో అడ్తి (కమీషన్), ట్రేడింగ్ (కొనుగోలు) లైసెన్సులు జారీ చేస్తారు. ఈఅధికారం ఆయా మార్కెట్ కమిటీల పరిధిలో ఉంటుంది. ట్రేడింగ్ లైసెన్సుల జారీ మాత్రం రాష్ట్ర మార్కెటింగ్‌శాఖ పర్యవేక్షణలో ఉంటుంది. ట్రేడింగ్ లైసెన్సుల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే సంబంధిత ధ్రువీకరణ పత్రాలు సరిగ్గా ఉంటే వెంటనే జారీ చేస్తారు. లైసెన్స్ పొందిన వ్యాపారికి తప్పనిసరిగా మార్కెట్ ఆవరణలో స్థలం, షాపులు ఉన్నప్పుడే కమీషన్ లైసెన్సులు జారీ చేయాలి. 2020లో గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ వందలాది కమీషన్ లైసెన్సులు జారీ చేసి పెద్ద మొత్తంలో అక్రమాలకు పాల్పడినందున అప్పటి కమిటీ చైర్మన్, మార్కెట్ కార్యదర్శిపై చర్యలు తీసుకోవడంతో పాటు చెక్‌పవర్ కూడా తొలగించారు. అదే సమయంలో వరంగల్ మార్కెట్‌లో సైతం నిబంధనలకు విరుద్ధంగా కమీషన్ లైసెన్సులు జారీ చేయడంపై ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఈలైసెన్సులకు అడ్డుకట్ట పడింది.

లైసెన్సులు: 721

వరంగల్ మార్కెట్‌లో కమీషన్ వ్యాపారులకు కేవలం 192 షాపులు ఉన్నాయి. 2018మార్చి 31వరకు మార్కెట్ పరిధిలో 601 కమీషన్ లైసెన్సులు జారీ అయ్యాయి. 01 ఏప్రిల్ 2018 నుంచి 31మార్చి 2022 వరకు 204 కమీషన్ లైసెన్సులు కొత్తగా జారీ చేయడంతో ఆసంఖ్య మరింత పెరిగింది. దీంతో మార్కెటింగ్‌శాఖ అధికారులు కమీషన్ లైసెన్సులు జారీ చేయొద్దని అధికారులకు మెమోలు జారీ చేసినా.. పాలకవర్గాల ఒత్తిళ్లతో కొత్త లైసెన్సుల జారీ ఆగడం లేదు. ప్రతీ ఏటా అసెస్‌మెంట్ నిర్వహించని కొంత మంది వ్యాపారుల లైసెన్సులు రద్దు అయినప్పటికీ.. ప్రస్తుతం మార్కెట్ పరిధిలో 721 కమీషన్ లైసెన్సులున్నాయి. ఇందులో గ్రెయిన్ మార్కెట్‌లో 537, ఫ్రూట్ మార్కెట్‌లో 85, కూరగాయల మార్కెట్‌లో 99 కమీషన్ లైసెన్సులున్నాయి. మార్కెట్‌కు సంబంధం లేని రాజకీయ నాయకులకు లైసెన్సులు జారీ చేశారనే ఆరోపణలు సైతం ఉన్నాయి. లైసెన్సుల జారీపై క్షేత్రస్థాయిలో విచారణ జరపాలని స్థానికులు కోరుతున్నారు.

ట్రేడింగ్ లైసెన్సులు: 513

మార్కెట్ కమిటీ ఆదాయం వచ్చే ట్రేడింగ్ లైసెన్సులకు మాత్రం పెద్దగా ఆదరణ లేదు. మార్కెట్ కమిటీ పరిధిలో కేవలం 513 ట్రేడర్స్ లైసెన్సులున్నాయి. ఇందులో గ్రెయిన్ మార్కెట్‌లో 418, ఫ్రూట్ మార్కెట్‌లో 34, కూరగాయల మార్కెట్‌లో 61 ట్రేడర్స్ లైసెన్సులు ఉన్నాయి.

హెచ్చరించినా డోంట్ కేర్

నిబంధనల మేరకు లైసెన్సులు జారీ చేయకపోతే చర్యలు తప్పవని మార్కెటింగ్‌శాఖ ఉన్నతాధికారులు హెచ్చరించినా.. కొత్త లైసెన్సుల జారీ కోసం దరఖాస్తులు, బ్యాంకు గ్యారెంటీలు స్వీకరించడం పలు అనుమానాలకు దారి తీస్తోంది. మార్కెట్ కమిటీ పదవీ కాలం మరో రెండు నెలల్లో ముగుస్తున్నందున కొత్త లైసెన్సులు జారీ చేసి ప్రయోజనం పొందేందుకు తీర్మానం చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్థలం ఉంటేనే లైసెన్సులు జారీ చేయాలి. స్థలం లేకుండా జారీ చేస్తే సదరు వ్యాపారికి స్థలం చూపించాల్సిన బాధ్యత కమిటీపై ఉంటుంది. లైసెన్సుల కోసం వ్యాపారులు నిరసనలు తెలపిన నేపథ్యంలో.. జూలై 3 వరకు ఇస్తామని కమిటీ, ఛాంబర్ హామీ ఇచ్చింది. ఇందుకోసం కార్యదర్శి హైదరాబాద్‌కు వెళ్లడం చర్చనీయాంశంగా మారింది. కొత్త లైసెన్సులను జారీ చేస్తారా? లేదా అనేది సోమవారం తేలనుంది.

గంజాయి పట్టివేత కేసులో..

- ఇద్దరికి పదేళ్ల జైలు శిక్ష, రూ. 2 లక్షల జరిమానా



మహబూబాబాద్ రూరల్: గంజాయి పట్టివేత కేసులో ఇద్దరు నేరస్తులకు పదేళ్ల జైలు శిక్ష, రూ.2 లక్షలు జరిమానా విధిస్తూ మహబూబాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.చంద్రశేఖర ప్రసాద్ మంగళవారం తీర్పు ఇచ్చారు. టౌన్ సీఐ ఎడ్లపల్లి సతీశ్ కథనం ప్రకారం.. 2016 డిసెంబర్ 29న జిల్లా కేంద్రంలో టౌన్ ఎస్సై కొమ్ము తిరుపతి పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా కురవి రోడ్డులో ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. దీంతో వారిని తనిఖీ చేయగా నాలుగు కేజీల గంజాయి లభించింది. దీనిని స్వాధీనం చేసుకుని అప్పటి టౌన్ సీఐ ఎస్ఏ జబ్బార్‌కు అప్పగించారు. దీంతో ఆయన.. అదేరోజు జిల్లా కేంద్రంలోని సిగ్నల్ కాలనీకి చెందిన అజ్మీరా సోమేశ్వర్, కురవి మండలం జగ్యాతండాకు చెందిన లూనావత్ సుమన్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. అనంతరం 2022 ఏప్రిల్ 23వ తేదీన అప్పటి టౌన్ సీఐ జూపల్లి వెంకటరత్నం గంజాయి పట్టివేత కేసు విషయంలో కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. టౌన్ సీఐ వై.సతీశ్ ఆధ్వర్యంలో కోర్టు డ్యూటీ ఆఫీసర్లు బీరం సంపత్‌రెడ్డి, బానోత్ మోహన్ 8 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. ప్రాసిక్యూషన్ పక్షాన జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ చిలుకమారి వెంకటేశ్వర్లు వాదనలు వినిపించారు. నేరం నిరూపణ కావడంతో ప్రధాన న్యాయమూర్తి పి.చంద్రశేఖరప్రసాద్.. ఇద్దరు వ్యక్తులకు ఒక్కొక్కరికి పదేళ్లు జైలు శిక్ష, రూ. లక్ష చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు.

రెండు బైక్‌లు ఢీ..

- ఒకరి మృతి, మరొకరికి తీవ్రగాయాలు
- గార్ల మండలంలో ఘటన

గార్ల: రెండు బైక్‌లు ఎదురెదురుగా వస్తూ ఢీకొనడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందగా మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన మంగళవారం మండలంలోని కోట్యానాయక్‌తండా సమీపంలో జరిగింది. గార్ల మండలం ముత్తితండాకు చెందిన ధరావత్ పూమ్యా(45) స్టాంప్ పేపర్ కోసం గార్లకు వచ్చి తిరిగి వెళ్తున్నాడు. ఈ క్రమంలో కోట్యానాయక్‌తండా సమీపంలో మలుపు వద్ద కొత్తపోచారం గ్రామానికి చెందిన నర్ల వెంకటేష్ బైక్‌పై ఎదురుగా వస్తూ పూమ్యాను ఢీకొనగా ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు. వెంకటేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలిసిన వెంటనే తండా వాసులు పూమ్యా మృతదేహాన్ని వెంకటేష్ ఇంటికి తీసుకెళ్లి ఆందోళన చేపట్టారు. అప్పటికే వెంకటేష్ కుటుంబ సభ్యులు ఇంటి నుంచి పరారయ్యారు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని పరిస్థితి సమీక్షించారు. కాగా, ఇంటి పెద్ద దిక్కును కోల్పోవడంతో భార్య కుమారులు, కుమార్తె.. పూమ్యా మృతదేహంపై పడి రోదించిన తీరు పలువురిని కంటతడి పెట్టించింది. ఇరు పక్షాల పెద్దమనుషుల సమక్షంలో మృతుడి కుటుంబానికి రూ.1.50 లక్షల పరిహారం చెల్లించాలని ఒప్పందం కుదిరినట్లు తెలిసింది. మృతుడి భార్య నీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకన్న తెలిపారు.



పూమ్యా (ఫైల్)

చదువుకు తగ్గ ఉద్యోగం రావడంలేదని..

- రైలు కింద పడి యువకుడి బలవన్మరణం

కాశిబుగ్గ: చదువుకు తగ్గ ఉద్యోగం రాక, ఆర్థిక సమస్యలతో మనస్తాపానికి గురైన ఓ యువకుడు వందే భారత్ రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన వరంగల్ – చింతలపల్లి రైల్వే స్టేషన్‌ల మధ్య వంచనగిరి రైల్వే గేట్ సమీపంలో సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. జీఆర్పీ సీఐ నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం లింగాపురం గ్రామానికి చెందిన తలబోయిన శివ(26) ఇంజనీరింగ్ పూర్తి చేసి ఉద్యోగ ప్రయత్నాలు చేస్తున్నాడు. 20 రోజుల క్రితం ఉద్యోగం కోసం హైదరాబాద్ వెళ్లాడు. ఉద్యోగ ప్రయత్నాలు చేయడం ఫలితం లేదు. శనివారం నగరానికి వచ్చి గ్రూపు–4 పరీక్షలు రాసిన శివ తన బావకు ఫోన్ చేసి డబ్బులు కావాలని అడిగాడు. తన వద్ద ప్రస్తుతం లేవని, సాయంత్రం పంపిస్తానని తెలిపాడు. ఈక్రమంలో ఆర్థిక ఇబ్బందులు, చదువు తగ్గ ఉద్యోగం రాక పోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన శివ.. సికింద్రాబాద్ నుంచి విశాఖపట్టణం వెళుతున్న వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి వద్ద లభించిన ఆధార్ కార్డు, ఏటీఎం కార్డుల ఆధారంగా కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. డిప్యూటీ ఎస్ఎస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు మంగళవారం అందజేశామని సీఐ తెలిపారు. కాగా, శివ ఆరునెలల క్రితం కూడా గడ్డి మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడని, సకాలం వైద్యం చేయించడంతో బతికి బయటపడ్డాడని మృతుడి బంధువులు తెలిపారు.



శివ(ఫైల్)

కేయూలో పలు విభాగాల అధిపతుల నియామకం

- యూనివర్సిటీ అభివృద్ధి అధికారిగా శ్రీనివాస్‌రెడ్డి
- అదనపు పరీక్షల నియంత్రణాధికారిగా తిరుమలాదేవి
- వర్సిటీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్‌గా మంజుల



పాలన పదవుల్లో నియమితులైన ఆచార్యులతో వీసీ రమేశ్, రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ అభివృద్ధి అధికారిగా కెమిస్ట్రీ విభాగం ప్రొఫెసర్ వాసుదేవ రెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారిగా మ్యాథమెటిక్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ తిరుమలాదేవి, యూనివర్సిటీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్‌గా కంప్యూటర్ సైన్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ బి.మంజుల నియమితులయ్యారు. మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా పీజీసెంటర్ల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా కూడా మంజులకు అదనపు బాధ్యతలు అప్పగించారు.

సీడీసీడీన్‌గా ఆచార్య రామచంద్రం కొనసాగింపు..

కాకతీయ యూనివర్సిటీ సీడీసీ డీన్‌గా దూరవిద్యా కేంద్రం జాయింట్ డైరెక్టర్‌గా ఆచార్య వి రామచంద్రంను , యూజీసీ కోఆర్డినేటర్‌గా జువాలజీ విభాగం ప్రొఫెసర్ ఆర్ మల్లికార్జున్‌రెడ్డిని , పరీక్షల విభాగంలోని కాన్ఫిడెన్షియల్ అదనపు పరీక్షల నియంత్రణాధికారిగా బాటనీ విభాగం ప్రొఫెసర్ ముస్తాఫాను కొనసాగిస్తూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శ్రీనివాస్‌రావు ఉత్తర్వులు జారీచేశారు. వీరి పదవీ కాలం ఇటీవల పూర్తికావడంతో మళ్లీ వారినే ఆయా పదవుల్లో కొనసాగించేలా ఉత్తర్వులు జారీచేశారు.

ఇంగ్లిష్ విభాగం అధిపతిగా దీపాజ్యోతి

కేయూ ఇంగ్లిష్ విభాగం అధిపతిగా అసిస్టెంట్ ప్రొఫెసర్ దీపాజ్యోతిని, ఆంగ్ల విభాగం బోర్డు ఆఫ్‌స్టడీస్ చైర్మన్‌గా డాక్టర్ మేఘనరావును, ఫిజిక్స్‌విభాగం బోర్డు ఆఫ్‌స్టడీస్ చైర్మన్‌గా డాక్టర్ జి పద్మజను నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

ఇద్దరు కాంట్రాక్ట్ లెక్చరర్లకు పదవులు

కేయూ ఎస్సీ, ఎస్టీసెల్ అంబేడ్కర్ స్టడీస్, ఎస్సీ, ఎస్టీ రెమిడీయల్ కోచింగ్ సెల్ సంచాలకుగాను తెలుగు విభాగం కాంట్రాక్టు లెక్చరర్ డాక్టర్ కె సదాశివ, బీసీ సెల్ మహాత్మాజ్యోతిరావు పూలే సెంటర్ ఫర్ రీసెర్చ్ అండ్ ఎంపవర్‌మెంట్ సెల్ డైరెక్టర్‌గా పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం కాంట్రాక్ట్ లెక్చరర్ ఎ శ్రీనివాస్‌ను నియమించారు.

కేయూలో పాలనను బలోపేతం చేద్దాం..

కేయూలో పాలనను బలోపేతం చేద్దామని వీసీ తాటికొండ రమేశ్ అన్నారు. మంగళవారం క్యాంపస్‌లోని కమిటీ హాల్‌లో పలువురు ఆచార్యులకు నూతన పరిపాలనా పదవులు, పలువురికి పాలన పదవుల్లో కొనసాగింపు ఉత్తర్వులను రిజిస్ట్రార్ శ్రీనివాస్‌రావుతో కలిసి అందజేశారు.

కేయూ హాస్టళ్ల డైరెక్టర్‌గా వెంకయ్య..

కాకతీయ యూనివర్సిటీ హాస్టళ్ల డైరెక్టర్‌గా జువాలజీ విభాగం ప్రొఫెసర్ వై.వెంకయ్య నియమితులయ్యారు. ఈ మేరకు కేయూ రిజిస్ట్రార్ ఆచార్య టి.శ్రీనివాస్ రావు మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. హాస్టళ్ల డైరెక్టర్‌గా ఉన్న మంజుల స్థానంలో వెంకయ్యను నియమించారు. ప్రస్తుతం వెంకయ్య యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్‌గా కొనసాగుతున్నారు. కాగా, ఈనెల 5న ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు.

కేయూ సోషల్ సైన్స్‌డీన్‌గా మనోహర్..

కాకతీయ యూనివర్సిటీ సోషల్ సైన్స్ డీన్‌గా హిస్టరీ విభాగం ఆచార్యుడు టి.మనోహర్ నియమితులయ్యారు. అలాగే ఆ విభాగం అధిపతిగా కూడా ఆయనే నియతులయ్యారు. ఈ మేరకు రిజిస్ట్రార్ ఆచార్య టి శ్రీనివాస్‌రావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు సోషల్ సైన్స్‌డీన్‌గా, విభాగం అధిపతిగా ఉన్న ఆచార్యుడు కె విజయ బాబు గత నెల 30న ఉద్యోగ విరమణ పొందారు. దీంతో ఆయన స్థానంలో టి మనోహర్‌ను నియమించారు. ఈ మేరకు మంగళవారం మనోహర్ బాధ్యతలు స్వీకరించారు.


క్షణికావేశంతో ఒకరి ఆత్మహత్య



గౌతం కుమార్ (ఫైల్)

నర్సంపేట రూరల్: క్షణికావేశంతో ఒకరు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ ఘటన నర్సంపేటలో జరిగింది. పట్టణానికి చెందిన మేడి గౌతం కుమార్ (33) ఎలక్ట్రీషన్‌గా పనిచేస్తున్నాడు. ఈక్రమంలో ఖానాపురం మండలం అశోక్‌నగర్‌కు చెందిన రాధికతో పరిచయం ఏర్పడి 2017లో ప్రేమ వివాహం చేసుకున్నారు. నర్సంపేటలో అద్దెకు ఉంటున్నారు. రాధిక ప్రస్తుతం గూడూరు పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. వీరికి కుమారుడు, కుమార్తె సంతానం. ఈక్రమంలో దంపతుల మధ్య కొద్దిరోజుల నుంచి గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం తెల్లవారుజామున కూడా గొడవ జరగడంతో క్షణికావేశానికి లోనైన గౌతంకుమార్.. పక్క రూమ్‌లోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనిపై మృతుడి తమ్ముడి కార్తీక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ పులి రమేశ్‌గౌడ్ తెలిపారు.

పిడుగుపడి మహిళ మృతి




మల్కి(ఫైల్)

గీసుకొండ: మండలంలోని దస్రుతండా గ్రామపంచాయతీ శివారు సింగ్యాతండాలో పిడుగుపడి ఓ మహిళ మృతి చెందింది. ఈ ఘటన మంగళవారం సాయంత్రం జరిగింది. తండాకు చెందిన బాదావత్ మల్కి(46) తన వ్యవసాయ క్షేత్రం వద్ద కూరగాయలు తెంపుతోంది. ఈ క్రమంలో వర్షం కురుస్తుండడంతో ఇంటికి వస్తోంది. మార్గమధ్యలో ఆమెపై పిడుగు పడగా అక్కడే మృతి చెందింది. అలాగే, ఈ ప్రమాదంలో ఆమెకు కొద్ది దూరంలో ఉన్న ఆమె మరిది బాదావత్ రెడ్యా కూడా పిడుగు ప్రభావానికి అస్వస్థతకు గురయ్యారు. మృతురాలికి భర్త ఈర్య, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. మృతురాలి కుటుంబాన్ని ఆదుకోవాలని దస్రుతండా సర్పంచ్ కేలోతు సరోజన కోరారు. అలాగే, ఇదే తండాకు చెందిన హాలావత్ వీరన్న తన దూడ చెట్టుకు కట్టేశారు. ఈ క్రమంలో పిడుగుపడి దూడ మృత్యువాత పడినట్లు స్థానికులు తెలిపారు.

నందిగామలో చలి పిడుగుపడి దుక్కిటెద్దు..

- అస్వస్థతకు గురైన రైతు

నల్లబెల్లి : చలి పిడుగుపాటుకు దుక్కిటెద్దు మృతిచెందగా, రైతు తీవ్ర అస్వస్థతకు గురైన సంఘటన మండలంలోని నందిగామలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. నందిగామ గ్రామానికి చెందిన దూకెర మల్లయ్య పత్తిలో గుంటుక తోలేందుకు అద్దెకు వెళ్లాడు. వర్షం రావడంతో గుంటుకతో ఎద్దులను తోలుకొని ఇంటికి తిరుగుపయనమయ్యాడు. ఈ క్రమంలో దుక్కిటెద్దుపై చలిపిడుగు పడడంతో మృత్యువాతపడింది. మల్లయ్య తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబ సభ్యులు వెంటనే ఆయనను ములుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు.



మృతిచెందిన మేకలు

పిడుగుపాటుకు మేకలు మృతి.. కాపరికి అస్వస్థత

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి మండలం మోరంచపల్లి గ్రామంలో మంగళవారం సాయంత్రం పిడుగుపాటుకు 9 మేకలు మృతిచెందగా, కాపరి అస్వస్థతకు గురయ్యాడు. గ్రామానికి చెందిన గొర్రెల కాపరి మేకల రాములు మోరంచ వాగు పక్కన ఉన్న లిఫ్ట్ ఇరిగేషన్ వద్ద మేకలు మేపుతుండగా పిడుగు పడింది. 9 మేకలు మృతిచెందాయి. కాపరి రాములు అస్వస్థతకు గురికావడంతో జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు గ్రామస్తులు తెలిపారు.

రైల్వే వ్యాగన్ పరిశ్రమలపై రాజకీయం వద్దు

- తెలంగాణ రైల్వే జేఏసీ నాయకులు




మాట్లాడుతున్న రైల్వే జేఏసీ కన్వీనర్ రాఘవేందర్

కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే ఉద్యమాల చరిత్రలో 40 ఏళ్ల తర్వాత కేంద్ర ప్రభుత్వం రైల్వే వ్యాగన్ రిపేర్ వర్క్‌షాప్ (పీఓహెచ్), రైల్వే వ్యాగన్ తయారీ పరిశ్రమను నెలకొల్పడానికి గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడం శుభపరిమాణమని,అందరం కలిసి ఈ అభివృద్ధిని స్వాగదిద్దామని తెలంగాణ రైల్వే జేఏసీ కన్వీనర్ దేవులపల్లి రాఘవేందర్ అన్నారు. ఇందుకు సహకరించిన, కృషి చేసిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈమేరకు మంగళవారం కాజీపేట రైల్వే మిక్స్‌డ్ హైస్కూల్ ప్రాంగణంలో రైల్వే జేఏసీ నాయకులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాఘవేందర్ మాట్లాడుతూ కాజీపేటకు నాలుగు దశాబ్దాల క్రితం కోచ్ ఫ్యాక్టరీ మంజూరై పంజాబ్‌కు తరలిపోయిందన్నారు. ఈక్రమంలో ఉమ్మడి ఏపీ విభజన అనంతరం తెలంగాణకు కోచ్‌ఫ్యాక్టరీ మంజూరు చేయాలని కోరామన్నారు. కాజీపేట కోచ్‌ఫ్యాక్టరీ కోసం ఎన్నో ఉద్యమాలు చేశామన్నారు. ఇందులో భాగంగా 2001లో చలో ఢిల్లీ నిర్వహించామని, అఖిలపక్షంతో 14 సార్లు రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించామన్నారు. అయితే కాజీపేటలో కోచ్‌ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని ఈ ప్రాంత ప్రజలు, అన్ని వర్గాల వారు ఉద్యమాలు చేస్తున్న తరుణంలో మెదక్ జిల్లా కొండకల్‌లో 2021 ఫిబ్రవరి 7న రాష్ట్ర ప్రభుత్వం మేధా కంపెనీతో ఏర్పాటు చేసిన కోచ్ ఫ్యాక్టరీకి రాష్ట్ర మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, సబితాఇంద్రారెడ్డి శంకుస్థాపన చేశారని, 2023 జూన్ 22న సీఎం కేసీఆర్ కోచ్‌ఫ్యాక్టరీని ప్రారంభించడం గమనార్హమన్నారు. రైల్వే ఒప్పందం ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం నూతన కోచ్‌ఫ్యాక్టరీలో 30 వందే భారత్ రైళ్ల ఉత్పత్తికి అంగీకరించిందన్నారు. ఇదే కోచ్‌ఫ్యాక్టరీ కాజీపేటలో ఏర్పాటు చేస్తే నిరుద్యోగ సమస్య పరిష్కారంతో పాటు ఈ ప్రాంత అభివృద్ధి జరిగేదన్నారు. భవిష్యత్‌లో కోచ్‌ఫ్యాక్టరీ కోసం నిరంతరం ఉద్యమం చేపడుతామన్నారు. సమావేశంలో రైల్వే జేఏసీ చైర్మన్ కొండ్ర నర్సింగరావు, నాయకులు పి.వేదప్రకాశ్, ఎ.సంతోష్‌కుమార్, ఎ.శ్రీనివాస్, ఎం.కె.మూర్తి, ఎల్లస్వామి, టి.ప్రవీణ్, డి.రవీందర్, శ్రీనుబాబు బి.మాధవరావు, ఎస్.లక్ష్మి నారాయణ, ఎం.మహేశ్ పాల్గొన్నారు.

అత్యుత్తమ సేవలకు ప్రతిఫలం..

- ఆర్టీసీ వరంగల్ రీజియన్ ఉద్యోగులకు అవార్డుల పంట



రాష్ట్ర స్థాయిలో ఉత్తమ సేవలు అందించిన వరంగల్–1 డిపో మెకానికలను సన్మానిస్తున్న ఆర్టీసీ ఎండీ సజ్జనార్

హన్మకొండ: అత్యుత్తమ సేవలు అందించిన ఆర్టీసీ వరంగల్ రీజియన్ ఉద్యోగులు రాష్ట్ర స్థాయిలో అవార్డులు పొందారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఆర్టీసీ కల్యాణమండపంలో ఉత్తమ ఉద్యోగులకు అవార్డుల ప్రదానం, సన్మాన కార్యక్రమం జరిగింది. సంక్రాంతి, దసరా పండగల సందర్భంగా ప్రయాణికులకు రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ సేవలు అందించినందుకు ఉద్యోగులను గుర్తించి వారికి అవార్డులు ప్రకటించారు. టీఎస్ ఆర్టీసీ కార్పొరేషన్ (రాష్ట్ర) స్థాయిలో వరంగల్–1 డిపోకు చెందిన కండక్టర్లు కే అనిల్ కుమార్, బీ ఉపేంద్రాచారి, ఉత్తమ డ్రైవర్లు కే వీరయ్య, ఓఆర్‌కే రెడ్డి, ఎండీ జహంగీర్, వరంగల్–1 డిపోలో వాటర్ ప్లాంట్ నిర్మాణం, ఏసీ బస్సుల నిర్వహణ కోసం సులభంగా ఉండే నిచ్చెనను తయారు చేసినందుకుగాను ఇన్నోవేషన్ విభాగంలో మెకానిక్‌లు కే మల్లికార్జున్, ఆర్ కొమురయ్య, వీ సుదర్శన్, జీ రాజమౌళికి ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వీసీ సజ్జనార్ వార్షిక పురస్కారాలు అందించారు. అత్యుత్తమ సేవలు అందించినందుకు అభినందించారు. కార్యక్రమంలో వరంగల్ రీజినల్ మేనేజర్ జె.శ్రీలత, డిప్యూటీ రీజినల్ మేనేజర్ ఆపరేషన్ బి.కృపాకర్ రెడ్డి, డిప్యూటీ రీజినల్ మేనేజర్ మెకానికల్ జి.మాధవరావు, వరంగల్–1 డిపో మేనేజర్ పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.